క్లుప్తంగా

కేలండర్ ఆవిష్కరణ



కేలండర్ ఆవిష్కరణ చేస్తున్న సినీ గేయ రచయిత చంద్రబోస్ తదితరులు

మలక్‌పేట: ప్రముఖ సినీ గేయ రచయిత చంద్రబోస్ చేతుల మీదుగా సియోరా గ్రూప్ రియల్ ఎస్టేట్ కేలండర్, డైరీ ఆవిష్కరించినట్లు సినీ దర్శకుడు అమరేందర్ గురువారం మూసారంబాగ్‌లోని కార్యాలయంలో ఒక ప్రకటన విడుదల చేశారు. కార్యక్రమంలో సంస్థ ఎండీలు డాక్టర్ రాజిరెడ్డి, సంతోష్‌రెడ్డి, డైరెక్టర్లు కిరణ్‌కుమార్, డాక్టర్ శివారెడ్డి, సతీష్, ఉపేందర్‌రావు పాల్గొన్నారు.

రక్తదానం



మలక్‌పేట: గడ్డిఅన్నారంలోని యాస్పిరెంట్స్ రీడింగ్ రూమ్ యాజమాన్యం ఆధ్వర్యంలో గురువారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. దాదాపు 50 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. మెహిదీపట్నం ప్రీమియర్ వలంటరీ బ్లడ్ బ్యాంక్ వారు రక్తాన్ని సేకరించారు. తలసేమియా, కేన్సర్స్ బాధితుల కోసం రక్తదాన శిబిరాన్ని చేపట్టామని నిర్వాహకుడు బాలకృష్ణ తెలిపారు. రక్త దానం చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్స్ అందజేశారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

హస్తినాపురం: అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించి త్వరితగతిన పూర్తి చేయాలని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ అన్నారు. గురువారం వివిధ కాలనీలలో జరుగుతున్న అభివృద్ధి పనులను కార్పొరేటర్ పరిశీలించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, ఆయాకాలనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

చైన్ స్నాచర్ అరెస్టు



నిందితుడి నుంచి స్వాధీనం చేసుకున్న సొత్తు

చైతన్యపురి: చైన్‌స్నాచింగ్‌కు పాల్పడిన కేసులో నిందితుడిని చైతన్యపురి పోలీసులు గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ మధుసూదన్ సమాచారం మేరకు... మోహన్‌నగర్ చౌరస్తాలో అనుమానాస్పదంగా తిరుగుతున్న గ్రీన్‌హిల్స్ కాలనీకి చెందిన లింగాల లక్ష్మారెడ్డిని అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో చైన్ స్నాచింగ్ విషయం బయటపడింది. మంగళవారం అల్కాపురి చౌరస్తాలో శ్యామలాంబ అనే వృద్ధురాలు నడచుకుంటూ వెళ్తుండగా ఆమె మెడలోని బంగారు గొలుసును లాక్కెళ్లినట్లు నిందితుడు అంగీకరించాడని ఇన్‌స్పెక్టర్ వెల్లడించారు. జల్సాలకు అలవాటుపడి సులువుగా డబ్బు సంపాదించేందుకు నేరాల బాట పట్టినట్లు ఆయన తెలిపారు. నిందితుడి నుంచి 20 గ్రాముల బంగారు గొలుసు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించామన్నారు.

భర్తతో గొడవపడి మహిళ అదృశ్యం



శిరీష

హయత్‌నగర్: భర్తతో గొడవపడి ఓ మహిళ అదృశ్యమైన సంఘటన గురువారం హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల సమాచారం మేరకు... హయత్‌నగర్ డివిజన్ సూర్యానగర్‌లో నివసించే ఇసుకపల్లి మహీంద్రారెడ్డి ప్రైవేటు ఉద్యోగి. ఆయన భార్య శిరీష(25) బుధవారం రాత్రి గుర్తు తెలియని వారితో ఫోన్‌లో చాటింగ్ చేస్తుంది. ఈ విషయమై భర్త ప్రశ్నించడంతో వారి మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో శిరీషపై భర్త చేయి చేసుకున్నాడు. దీంతో మనస్తాపానికి గురైన శిరీష చెప్పకుండా ఇంట్లోంచి వెళ్లిపోయింది. చుట్టుపక్కల, తెలిసిన వారి వద్ద వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో భర్త మహీంద్రారెడ్డి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

హెచ్‌సీఏ మాజీ కార్యదర్శి చలపతి కన్నుమూత

హరియాణా గవర్నర్ దత్తాత్రేయ సంతాపం



చలపతి (ఫైల్)

సైదాబాద్: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ మాజీ కార్యదర్శి డి.ఎస్.చలపతి అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. సమాచారం అందుకున్న హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ గురువారం ఆయన మేనల్లుడు కృష్ణతో ఫోన్‌లో మాట్లాడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. చలపతి మృతి పట్ల హరియాణా రాజ్‌భవన్ నుంచి విడుదల చేసిన ప్రకటనలో ఆయన తీవ్ర సంతాపం చేశారు. చలపతితో ఉన్న సాన్నిహిత్యాన్ని దత్తాత్రేయ గుర్తుచేసుకున్నారు. సైదాబాద్ డివిజన్ ఆంధ్రాబ్యాంక్ కాలనీలో నివసించే డీఎస్ చలపతి సుదీర్ఘకాలం హెచ్‌సీఏకు సేవలందించారు. గతంలో ఆయన బీజేపీ క్రీడావిభాగం కన్వీనర్‌గానూ వ్యవహరించారు. శుక్రవారం ఆయన అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

అడ్డగోలు నిర్మాణాలతో పరేషాన్

ప్రధాన రహదారులతోపాటు కాలనీలలోని అంతర్గత రోడ్లపై అడ్డగోలుగా నిర్మిస్తున్న ర్యాంపులు వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయి. ఒక నిర్దిష్టమైన పద్ధతి లేకుండా రోడ్లపైకి ర్యాంపుల నిర్మాణం సాగుతుండటంతో చాలా చోట్ల రోడ్లు ఇరుకుగా మారుతున్నాయి. రోడ్డుకు ఇరువైపులా ర్యాంపులు ఉండడంతో రోడ్లు కుంచించుకుపోయి ఆ దారినవెళ్లే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

- రోడ్లపై అడ్డగోలుగా ర్యాంపులు, మెట్లు
- కుంచించుకుపోతున్న రహదారులు
- వాహనదారులు, పాదచారులకు తప్పని ఇబ్బందులు
- ప్రమాదాలు జరుగుతున్నా పట్టని అధికారగణం





హయత్‌నగర్ డివిజన్ కమలానగర్‌లో రోడ్డుపైకి వచ్చిన మెట్లు, సుభద్రానగర్‌లో మెట్లు, రెయిలింగ్‌లు



వనస్థలిపురం డివిజన్ క్రిస్టియన్ కాలనీలో రోడ్డు మధ్య వరకు వచ్చిన ర్యాంపు, శ్రీకృష్ణానగర్‌లో రోడ్డుకు ఇరువైపులా ర్యాంపులు, గ్రీనరీతో ఇరుకుగా మారిన రోడ్డు

వనస్థలిపురం: ర్యాంపులు, ఇతర నిర్మాణాలపై టౌన్ ప్లానింగ్ అధికారులు గానీ, కాలనీ సంక్షేమ సంఘాలుగానీ పెద్దగా పట్టించుకోకపోవడంతో పలువురు ఇష్టారీతిన నిర్మాణాలు చేపడుతున్నారు. బస్సులు తిరిగే రహదారులతో పాటు, కాలనీలలో రోడ్ల వెంబడి ఇళ్లు, అపార్ట్‌మెంట్లు, వాణిజ్య భవనాలు నిర్మాణాలు జరుపుకొంటుండటంతో వాటికి సంబంధించిన ర్యాంపులు, మెట్లు, రెయిలింగ్‌లు రోడ్డుపైకి వస్తున్నాయి.

- రోడ్డుకు సమాంతరంగా గృహాలు నిర్మిస్తే భవిష్యత్‌లో రోడ్డు ఎత్తును పెంచితే ఇళ్లు దిగువకు అవుతాయనే ఉద్దేశంతో గృహస్తులు చాలా ఎత్తులో ఇళ్లను నిర్మిస్తున్నారు.
- దీంతో వారి వాహనాలు ఇంట్లోకి, బయటికి వెళ్లాలంటే ర్యాంపులను నిర్మించుకోవాల్సిన పరిస్థితి. అయితే గేటు లోపలి వైపు ర్యాంపులను నిర్మించుకోవడానికి బదులు గేటు నుంచి రోడ్డుపైకి ర్యాంపులను నిర్మిస్తుండటంతో ఎత్తునుబట్టి ఒకో చోట రోడ్డు మధ్యవరకు ర్యాంపులు వస్తున్నాయి.
- దీనికి తోడు గ్రీనరీ పేరిట ప్రహరీ నుంచి 3, 4 ఫీట్ల మేర వెడల్పులో అడ్డుగోడలు నిర్మిస్తుండటంతో రోడ్డు కుంచించుకుపోతోంది.
- రోడ్డుకు ఇరువైపులా గృహస్థులు ర్యాంపులు, గ్రీనరీ ఏర్పాటు చేసుకుంటుండటంతో 20 ఫీట్ల రోడ్డు కాస్తా 10 ఫీట్ల మేర మూసుకుపోతోంది.
- దీంతో ఆ దారిన వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 10 ఫీట్ల రోడ్డులో సైతం గృహస్తులు వాహనాలను పార్కింగ్ చేస్తుండటంతో ఇక దారి నుంచి వాహనాలు వెళ్లే పరిస్థితి ఉండటం లేదు.
- ఈ విషయమై ఇళ్ల యజమానులు, వాహనదారులకు మధ్య నిత్యం గొడవలు జరిగే పరిస్థితులు నెలకొన్నాయి.

రోడ్డు లెవెలింగ్ తెలియనందునే...

పలు డివిజన్లలో చాలా కాలనీలు ఇపుడిపుడే అభివృద్ధి చెందుతున్నాయి. చాలా చోట్ల ఇంకా పూర్తిస్థాయిలో రోడ్ల నిర్మాణం జరుగలేదు. దీంతో కొత్తగా ఇళ్లు నిర్మించుకునే వారు భవిష్యత్‌లో తమ ఇంటి ముందు రోడ్డును ఎంత ఎత్తులో నిర్మిస్తారో తెలియక ముందు జాగ్రత్తగా అవసరమైన దానికన్నా ఎత్తులో ఇళ్ల నిర్మాణం చేపడుతున్నారు. ఇల్లు ఎత్తులో ఉండటంతో వాహనాలు ఇంట్లోకి, బయటికి వెళ్లడానికి వీలుగా ర్యాంపుల నిర్మాణం చేపడుతున్నారు. అయితే పెద్ద ర్యాంపు నిర్మించాల్సివస్తే ఇంటి లోపలి నుంచి ర్యాంప్‌ను నిర్మించుకోవాలి తప్ప గేటు వద్ద నుంచి రోడ్డు పైకి నిర్మించవద్దని కాలనీ సంక్షేమ సంఘం నాయకులు పేర్కొంటున్నారు.

“భారీ ర్యాంపులు నిర్మించొద్దు

కాలనీ రోడ్లపై వాహనాల రాకపోకలకు ఆటంకం కలిగించే విధంగా ఎలాంటి ర్యాంపులు, నిర్మాణాలు చేపట్టరాదని కాలనీ అసోసియేషన్ సమావేశంలో నిర్ణయించాం. రోడ్ల నిర్మాణం పూర్తయిన చోట ఇల్లు, అపార్ట్‌మెంట్, దుకాణాల ముందు ర్యాంపులు ఎట్టి పరిస్థితుల్లో 3 అడుగులకు మించరాదు. రోడ్డును ఆక్రమించి నిర్మించే ర్యాంపులను తొలగిస్తాం.

– ఎం.శేఖర్‌రెడ్డి, అధ్యక్షుడు, విశ్వేశ్వరాయ ఇంజినీర్స్ కాలనీ



హస్తినాపురం డివిజన్ ద్వారకామయినగర్‌లో రోడ్డుపైకి వచ్చిన ర్యాంపు

సీఎం రోడ్డులో ఆక్రమణల తొలగింపు



కబ్జాలను తొలగిస్తున్న జీహెచ్‌ఎంసీ సిబ్బంది

లింగోజిగూడ: ఎల్‌బీనగర్ చౌరస్తాలో నూతనంగా నిర్మిస్తున్న మరో ఫ్లైఓవర్‌ను త్వరలో అందుబాటులోకి తీసుకొచ్చేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే ఇంజినీరింగ్, జీహెచ్‌ఎంసీ అధికారులు పలు మార్లు పరిశీలించారు. ఫ్లై ఓవర్ ప్రారంభం అయితే వనస్థలిపురం, చింతలకుంట నుంచి వచ్చే వాహనాలు దిల్‌సుఖ్‌నగర్ వైపు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రయాణించవచ్చు. అలాగే సరూర్‌నగర్ వైపు వెళ్లే వాహనాలు సీఎం రోడ్డు మీదగా వెళ్లేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అందులో భాగంగా గురువారం జీహెచ్‌ఎంసీ ఎల్‌బీనగర్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ ఏసీపీ వీరస్వామి, టీపీఎస్ శ్రీదేవి ఆధ్వర్యంలో సీఎం రోడ్డులో ఇరువైపులు రోడ్డును ఆక్రమించి ఏర్పాటు చేసుకున్న వాణిజ్య సముదాయాల బోర్డులు, డబ్బాలు, షెడ్లను తొలగించారు. ఈ సందర్భంగా స్థానిక వ్యాపారులు అధికారులతో వాగ్వాదానికి దిగి ఆందోళన చేశారు. అధికారులు ఫిర్యాదు మేరకు అక్కడికి చేరుకున్న పోలీసులు ఆక్రమణల తొలగింపులకు ఎలాంటి ఆటంకం లేకుండా చర్యలు తీసుకున్నారు. తొలగింపులపై ముందస్తు సమాచారం ఇచ్చి ఉంటే బాగుండేదని పలువురు వ్యాపారులు అభిప్రాయపడ్డారు.

లోకాయుక్త కాలనీలో గుడిసెల తొలగింపు

సైదాబాద్: న్యాయస్థానం ఆదేశాల మేరకు సైదాబాద్ మండల పరిధిలోని లోకాయుక్త కాలనీలోని గుడిసెలను గురువారం రెవెన్యూ అధికారులు తొలగించారు. తెల్లవారుఝామున భారీ పోలీసు బందోబస్తు నడుమ గుడిసెలు తీసివేశారు. గుడిసెవాసులకు ఇప్పటికే మూడుసార్లు నోటీసులు ఇచ్చామని రెవెన్యూ అధికారులు తెలిపారు. గుడిసెవాసుల పునరావాసానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామన్నారు. గుడిసెల తొలగింపు ప్రక్రియను ఈస్ట్‌జోన్ అడిషనల్ డీసీపీ శ్రీనివాస్‌రెడ్డి, ఏసీపీ వెంకటరమణ, ఇన్‌స్పెక్టర్ సుబ్బిరామిరెడ్డి, తహసీల్దార్ వేణుగోపాల్ పర్యవేక్షించారు.

వ్యక్తి ఆత్మహత్య

నాగోలు: ఆరోగ్య సమస్యలతో పాటు ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎల్‌బీనగర్ పోలీసుల సమాచారం మేరకు... నాగోలు, బండ్లగూడ, కృషినగర్ కాలనీలో ఉండే గడ్డం దేవేందర్‌గౌడ్(35) భార్య స్వాతి, కూతురు వినీషతో కలిసి ఉంటున్నాడు. బంజారాహిల్స్‌లోని వీఓ మొబైల్స్‌లో టీం లీడర్‌గా పనిచేస్తున్నాడు. దేవేందర్‌గౌడ్ షుగర్ వ్యాధితో బాధపడుతున్నాడు. మద్యానికి బానిస కావడంతో ఆర్థిక సమస్యలు ఏర్పడ్డాయి. ఇది తగదని భార్య స్వాతి చెప్పినా వినకుండా ఆమెతో వాగ్వాదానికి దిగేవాడు. ఈ నెల 3న పని నిమిత్తం బయటకు వెళ్లిన దేవేందర్‌గౌడ్ బుధవారం రాత్రి ఇంటికి వచ్చాడు. భార్య ప్రశ్నించడంతో ఆగ్రహించిన దేవేందర్ తను చనిపోతానంటూ సెల్‌ఫోన్ చార్జర్ వైర్ తీసుకున్నాడు. ఇంటి యజమానికి ఆమె చెప్పడంతో ఆయన దేవేందర్‌ను సముదాయించి వెళ్లిపోయాడు. బుధవారం రాత్రి రూమ్‌లోకి వెళ్లి తాను వేసుకున్న చెడ్డీకి ఉన్న తాడుతో హ్యాంగర్‌కు ఉరివేసుకున్నాడు. అనుమానంతో భార్య డోర్‌ను కొట్టగా ఎంతకీ తెరవలేదు. స్థానికులు డోర్‌ను పగులగొట్టి చూడగా దేవేందర్‌గౌడ్ ఉరివేసుకుని కనిపించాడు. వెంటనే ఎల్‌బీనగర్‌లోని కామినేని హాస్పిటల్‌కు తరలించగా దేవేందర్‌గౌడ్‌ను పరిశీలించిన వైద్యులు అప్పటికే అతను మృతి చెందినట్లు నిర్ధారించారు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

‘బూత్ మహా సమ్మేళన్’ను విజయవంతం చేయండి

బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న సురేందర్‌రెడ్డి

మలక్‌పేట: సలీంనగర్‌లోని సఫైర్ ఫంక్షన్ హాల్‌లో ఈ నెల 7 తేదీన నియోజకవర్గ ‘బీజేపీ బూత్ మహా సమ్మేళన్’ నిర్వహించనున్నట్లు భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి తెలిపారు. మూసారంబాగ్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ... శనివారం ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా హాజరవుతారన్నారు. బూత్ కమిటీ సభ్యులు, శక్తికేంద్రం ఇన్‌చార్జ్‌లు, పార్టీ, మోర్చాలకు చెందిన డివిజన్, జిల్లా, రాష్ట్ర కమిటీ నాయకులు పాల్గొంటారన్నారు. కార్యకర్తలు, నాయకులు సకాలంలో హాజరై మహా సమ్మేళన్ విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సమావేశంలో కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సండడి సురేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు గౌర దేవేందర్, సుభాష్‌చందర్, మలక్‌పేట కన్వీనర్ నవీన్‌రెడ్డి, సుభాష్‌చందర్, లింగాల హరిగౌడ్, కోళ్లగోపి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు



మలక్‌పేట: ధనుర్మాస తిరుప్పావై ప్రవచనోత్సవాలలో భాగంగా గురువారం మూసారంబాగ్ ఆండాళ్ నిలయంలో ‘ఏత్తకలంగాళ్’ మాతృశ్రీ రిందాదేవి తిరునక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. రిందాదేవి విగ్రహానికి పుష్పాభిషేకం చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఉ.వే.డాక్టర్ అప్పన్ కందాడై లక్ష్మణమూర్తి స్వామి భక్తులనుద్దేశించి అనుగ్రహ భాషణం చేశారు. రాత్రి 7 గంటలకు రిందాశరణ్య నాట్యమండలి యశోదా బృందం వారి నాట్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఆలయ నిర్వాహకురాలు లక్ష్మీదేవి, రూపాదేవి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

‘ఆయుష్మాన్ భారత్’ నమోదు షురూ

చంచల్‌గూడ: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ పథకం రిజిస్ట్రేషన్ ప్రక్రియ గురువారం కుర్మగూడ డివిజన్‌లో ప్రారంభమైంది. యాఖుత్‌పురా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఇంటింటికీ తిరిగి మొబైల్ యాప్ ద్వారా ఆయుష్మాన్ భారత్ పథకంలో రిజిస్ట్రేషన్ చేపట్టారు.



‘సంఘర్షణ యాత్ర’ను జయప్రదం చేయండి: సీఐటీయూ



యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

లింగోజిగూడ: సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన రవాణా రంగా కార్మికుల సంఘర్షణ యాత్రను జయప్రదం చేయాలని తెలంగాణ పబ్లిక్, ప్రైవేట్ రోడ్డు రవాణా కార్మికుల ఫెడరేషన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కడారి రాములు, సీఐటీయూ ఎల్‌బీనగర్ సర్కిల్ కన్వీనర్ ఆలేటి ఎల్లయ్యలు పిలుపునిచ్చారు. సంఘర్షణ యాత్రకు సంబంధించిన పోస్టర్‌ను గురువారం ఎల్‌బీనగర్ లేబర్ అడ్డాతో పాటు వనస్థలిపురం సుష్మ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. సంఘర్షణ యాత్ర జనవరి 3న ఖమ్మంలో ప్రారంభమైందని వివిధ జిల్లాల మీదుగా కొనసాగి సంగారెడ్డిలో ముగింపు యాత్ర ఉంటుందని నాయకులు తెలిపారు. నేతలు శ్రీనివాస్, సైదులు, రమేష్, రాములు, శంకర్, బాలనరసింహ, అశోక్, శ్రీధర్, సుధాకర్, పెంటారెడ్డి, మారయ్య, అశోక్, యాదగిరి, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ పనుల పరిశీలన



డ్రైనేజీ పనులను పరిశీలిస్తు కార్పొరేటర్ పవన్‌కుమార్

నాగోలు: డ్రైనేజీ పనులను సత్వరమే పూర్తిచేసి ప్రజలకు ఇబ్బందులకు కలగకుండా చూడాలని కొత్తపేట కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ అన్నారు. గురువారం కొత్తపేట డివిజన్ ప్రజానివాస్ ఫేజ్–2లో నూతన డ్రైనేజీ పైప్‌లైన్ పనులను, ఎస్ఆర్ఎల్ కాలనీలో బాక్స్ డ్రైనేజీ పనులను కార్పొరేటర్ పరిశీలించారు. ప్రజా నివాస్ ఫేస్–2లో అధ్యక్షుడు కొత్త తిరుమల్, నాయకులు సుందర్ నారాయణ, మంచి రాజేష్, గట్టు మహేష్, శరణ్ పాల్గొన్నారు.

పోషకాహార నిలయాలుగా అంగన్‌వాడీ కేంద్రాలు



దీదబ్ల్యూసీ ప్రతినిధులు అందజేసిన ఉపకరణాలతో చిన్నారులు

సైదాబాద్: బస్తీల్లోని చిన్నారులు, మహిళలకు అంగన్‌వాడీలు పోషకాహార కేంద్రాలుగా సేవలు అందిస్తున్నాయని దళిత ఉమెన్స్ కలెక్టివ్ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సుజాత సూరేపల్లి పేర్కొన్నారు. గురువారం ఆమె దళిత ఉమెన్స్ కలెక్టివ్ ప్రతినిధులతో కలిసి ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని సింగరేణి కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. అంగన్‌వాడీల ద్వారా అందిస్తున్న సేవలను కేంద్రాలలోని టీచర్లను అడిగి తెలుసుకున్నారు. సింగరేణి కాలనీలో ఏర్పాటు చేసిన తొమ్మిది అంగన్‌వాడీ కేంద్రాలలోని పిల్లలకు పలు ఉపకరణాలు అవసరమని గుర్తించారు. 9 కేంద్రాలలోని 160 మంది విద్యార్థులకు అవసరమైన వాటర్ బాటిళ్లు, పలకలు, భోజనం ప్లేట్‌లు, ఆడుకోవటానికి బొమ్మలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... దళిత ఉమెన్స్ కలెక్టివ్ తరుపున అంగన్‌వాడీ కేంద్రాలలోని చిన్నారులకు అవసరమైన మరికొన్ని పరికరాలు త్వరలో అందిస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు పావని, గంగ, దుశ్యంత్ పాల్గొన్నారు.

కల్వర్టు పనుల్లో జాప్యంపై కార్పొరేటర్ ఆగ్రహం



కల్వర్టు పనులను పరిశీలిస్తున్న నవజీవన్‌రెడ్డి

హయత్‌నగర్: ఎంత కాలం పని చేస్తారు.. ఎప్పుడో పూర్తి చేయాల్సిన పనులు ఎందుకు ఆలస్యం చేస్తున్నారు.. ఎన్ని రోజులు ప్రజలు అవస్థలు పడాలి.. అంటూ అధికారులు, కాంట్రాక్టర్‌పై కార్పొరేటర్ క్లెం నవజీవన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం హయత్‌నగర్ డివిజన్‌లోని మునుగనూరు వెళ్లే దారిలో నిర్మిస్తున్న కల్వర్టు పనులను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వర్షాకాలంలో శంకుస్థాపన చేసిన కల్వర్టు పనులు ప్రారంభించేందుకు ఆలస్యం చేశారని, పనులు మొదలు పెట్టి కూడా ఆలస్యంగా చేస్తున్నారన్నారు. కల్వర్టు నిర్మాణం ఆలస్యం అవుతుండటంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వేగంగా పనులు పూర్తి చేసి కల్వర్టును తొందరగా వినియోగంలోకి తేవాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఈఈ దామోదర్, ఏఈ నరేంద్రతేజ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో మెరుగైన వసతుల కల్పనకు కృషి



సమస్యలను తెలుసుకుంటున్న కార్పొరేటర్ మధుసూదన్‌రెడ్డి

చంపాపేట: చంపాపేట డివిజన్ పరిధిలోని ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో మెరుగైన వసతును కల్పించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన కర్మన్‌ఘాట్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. భోజనశాల, టాయిలెట్స్, తాగునీరు, తరగతి గదులు, పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలించారు. మధ్యాహ్న భోజన పనితీరుపై ఆయన విద్యార్థులను ఆరాతీసి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల హాజరు శాతం పెంచేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధపెట్టాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం గణేష్, నాయకులు సద్ది సందీప్‌రెడ్డి, శ్రీధర్‌గౌడ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ భువనేశ్వరి

విద్యార్థులకు అభినందన

మలక్‌పేట: మూసారంబాగ్ శ్రీచైతన్య స్కూల్ విద్యార్థులు ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలంపియాడ్ (టీఎన్‌టీఎస్‌ఓ) లెవల్–2 పరీక్షకు అర్హత సాధించారని ప్రిన్సిపాల్ భువనేశ్వరి తెలిపారు. గురువారం స్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపికైన 69 మంది విద్యార్థులను ఆమె అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ... విద్యార్థులకు చదువుతో పాటు వ్యక్తిత్వ వికాసం పెంపొందించేలా తీర్చిదిద్దున్నామన్నారు. కార్యక్రమంలో దిల్‌సుఖ్‌నగర్ జోన్ ఏజీఎం సతీష్, ఎగ్జిక్యూటివ్ డీన్ ప్రవీణ్, కో ఆర్డినేటర్ రఘువంశీ, ఆర్ఐ వెంకట్‌రెడ్డి, డీన్ గిరి తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటికలో వసతులు కల్పిస్తా



శ్మశానవాటికను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: శ్మశానవాటికలో మౌలిక వసతులు కల్పిస్తామని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి స్పష్టంచేశారు. డివిజన్ హయత్‌నగర్ పరిధి వీరభద్రనగర్‌కాలనీలోని దళితుల శ్మశానవాటికను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భ ంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... శిథిలావస్థలో ఉన్న స్నానపు గదుల డోర్లను, ప్రహరీపై ఫెన్సింగ్ వేయిస్తానని తెలిపారు. పనిచేయని బోరును తొలగించి నూతన బోరును మంజూరు చేయిస్తానని పేర్కొన్నా రు. కార్యక్రమంలో నేతలు పారంద స్వామి, ఎర్ర రవీ ందర్, పారంద సాయి, ఎర్ర హరిబాబు, నవీన్‌గౌడ్, కడారి యాదగిరి యాదవ్, సిద్ధు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన అవసరం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఏసీపీ శంకర్‌రాజు

సైదాబాద్: విద్యార్థులు అందరూ ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ఏసీపీ శంకర్‌రాజు సూచించారు. గురువారం ఆస్మాన్‌ఘడ్‌లోని సెయింట్ జోసెఫ్ స్కూల్‌లోని విద్యార్థులకు ట్రాఫిక్ అవేర్‌నెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వాహనదారులందరూ ట్రాఫిక్ సిబ్బందికి సహకరిస్తూ వారి సూచనలు, ఆదేశాలు పాటిస్తే ఎలాంటి ప్రమాదాలు జరగవన్నారు. మలక్‌పేట ఎస్ఐ జయంత్, పాఠశాల ప్రిన్సిపాల్ సుందరి తదితరులు పాల్గొన్నారు.

నియామకం



నియామక పత్రం తీసుకుంటున్న లక్ష్మి

మలక్‌పేట: జైభీమ్ జై మీమ్ ఎస్సీ, ఎస్టీ, బీసీ అండ్ మైనార్టీ అభివృద్ధి సేవా సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. గ్రేటర్ ప్రధాన కార్యదర్శిగా అంబారి పవన్‌కుమార్, ఐఎస్‌సదన్ అధ్యక్షుడిగా యర్రవెల్లి శ్రీనివాస్, మూసారంబాగ్ అధ్యక్షుడిగా అన్నెపర్తి సోమయ్య, ప్రధాన కార్యదర్శిగా పి.రాంచందర్, మహిళా విభాగం అధ్యక్షురాలుగా పొనకంటి లక్ష్మీలు నియమితులయ్యారు. మూసారంబాగ్‌లో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు శ్యాగారి శ్రీనివాస్ చేతుల మీదుగా వారు నియామక పత్రాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల సంక్షేమం, హక్కుల సాధన కోసం శక్తి వంచనలేకుండా కృషి చేస్తానన్నారు. రాష్ట్ర జాయింట్ సెక్రటరీ ఉదరి రాజు, హైదరాబాద్ అధ్యక్షుడు ఏడవల్లి నర్సింహ, నాగయ్య, యాదగిరి, సాయి, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ సూర్య

హయత్‌నగర్: కొత్తకొత్త ఎత్తుగడలతో సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారని, సైబర్ నేరాలపై విద్యార్థులు మరింత అప్రమత్తంగా ఉండాలని హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ సబ్‌ఇన్‌స్పెక్టర్ సూర్య అన్నారు. గురువారం హయత్‌నగర్‌లోని అభ్యాస కళాశాలలో సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ... ఇంటర్నెట్ ద్వారా పలు మోసపూరితమైన యాప్‌లు పుట్టుకొస్తున్నాయని, ఆకర్షణీయంగా ఉండే ఇలాంటి యాప్‌ల జోలికి వెళ్లరాదని సూచించారు. లోన్‌లు ఇస్తామని, గిఫ్టులు పంపుతామని, ఉద్యోగాలు, వివాహ సంబంధాలు చూస్తామని ఆన్‌లైన్‌లో మభ్యపెట్టి మోసగిస్తారని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ గుర్తు తెలియని వారితో ఓటీపీలను, కేవైసీలను షేర్ చేసుకోవద్దని విద్యార్థులకు సూచించారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9666021515
9505507616
9912220363
9912220365